
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024



వాడపల్లికి పోటెత్తిన భక్తులు

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి శనివారం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. - 8లో



డెల్టాకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 2 వేలు, మధ్య డెల్టాకు 1,550, పశ్చిమ డెల్టాకు 3,600 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
40.0° / 26.5°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	40.0	22.0
కాకినాడ	35.3	26.5
అమలాపురం	39.0	26.0

న్యూస్‌రీల్

22న మంత్రి విశ్వరూప్ నామినేషన్



అమలాపురం టౌన్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పినిపే విశ్వరూప్ ఈ నెల 22న నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆ రోజు ఉదయం అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లిలోని కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఆలయం నుంచి అమలాపురం ఆర్డీవో కార్యాలయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ర్యాలీగా వెళతారు. ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తారు.

ఇమామ్‌లు, మౌజన్లకు రూ.65.70 లక్షల విడుదల

అమలాపురం టౌన్: జిల్లాలోని 73 మసీదులకు చెందిన 146 మంది ఇమామ్‌లు, మౌజన్లకు రాష్ట్ర వక్ఫ్ బోర్డు గౌరవ వేతనం విడుదల చేసింది. 2023 అక్టోబర్ నుంచి 2024 మార్చి (ఆరు నెలలు) వరకూ రూ.65.70 లక్షలు జమ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇమామ్‌లకు నెలకు రూ.10 వేలు, మౌజన్లకు నెలకు రూ.5 వేల వంతున గౌరవ వేతనం ఇస్తున్న సంగతి తెలిసిందే. రంజాన్ పండగ కానుకగా ఆరు నెలల గౌరవ వేతనం ఒకేసారి ఇవ్వడంపై అమలాపురానికి చెందిన జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ హర్షం వ్యక్తం చేశారు. గౌరవ వేతనం విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు ఖాదర్‌తో పాటు జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్లు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు జయలక్ష్మి బాధితుల సమావేశం

అమలాపురం టౌన్: ది జయలక్ష్మి ఎంఏఎం కోఆపరేటివ్ సొసైటీ వల్ల మోసపోయిన బాధితులు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు అమలాపురం ఏఎస్ఎన్ కళాశాలలో సమావేశం కానున్నారు. ఈ విషయాన్ని సమావేశ నిర్వాహక కమిటీ ప్రతినిధులు శనివారం విలేకరులకు తెలిపారు. కాకినాడ కేంద్రంగా పనిచేసిన జయలక్ష్మి సొసైటీ రెండేళ్ల క్రితం బోర్డు తిప్పేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధితులు సమావేశమై తనకు జరిగిన అన్యాయంపై చర్చించనున్నారు. సొసైటీకి చెల్లించిన తమ డిపాజిట్ల తొందరగా ఇచ్చి, ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న తమను ఆదుకోవాలని కోరనున్నారు.

బాల బాలాజీకి రూ.2.26 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు తీరిన స్వామివారి దర్శనానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తులు భారీగా రావడంతో పాత గుడితో పాటు కొత్త గుడి కిక్కిరిసింది. నిత్యం నిర్వహించే శ్రీలక్ష్మీ నారాయణ హోమం వైభవంగా జరిగింది. స్వామి వారికి రూ.2.26 లక్షలు ఆదాయం వచ్చిందని ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.1.81 లక్షలు, నిత్య అన్నదానం ట్రస్టుకు విరాళంగా రూ.44,641 వచ్చాయన్నారు. 3,164 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని, 2,380 మంది అన్న ప్రసాదం స్వీకరించారని తెలిపారు.

పంచాయతీల్లో నేటి నుంచి గ్రామసభలు



రాంబాబు, డీపీవో

అమలాపురం రూరల్: జిల్లాలోని పంచాయతీల్లో ఆదివారం నుంచి వారం రోజుల లోపు గ్రామ సభలు నిర్వహించాలని కార్యదర్శులకు జిల్లా పంచాయతీ అధికారి ఈ.రాంబాబు ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాదీ జనవరి 26, ఏప్రిల్ 14, జూలై 1, అక్టోబర్ 3వ తేదీల్లో గ్రామసభలు జరపాలనే నిబంధన ఉందన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా గ్రామ సభలు జరపాలని, అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓటర్లను ప్రభావం చేసే అంశాలను సభలో చర్చించకూడదన్నారు. గ్రామసభలో ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఓటింగ్ శాతం పెరగడానికి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సభకు అధ్యక్షుడిగా సర్పంచ్ ఉంటారని, కానీ ఏ విధమైన రాజకీయ ప్రసంగాలు ఇవ్వకూడదని, కొత్త తీర్మానాలు చేయరాదన్నారు. ఏ రాజకీయ పార్టీకి చెందిన చిహ్నాలు, జెండాలు ధరించి రాకూడదన్నారు. సమావేశాలకు వచ్చే ప్రజలు కూడా ఎన్నికల నియమావళికి కట్టుబడి ఉండాలని సూచించారు.

ప్రచార తుఫ్యాన్

- దూసుకుపోతున్న పొన్నాడ
- నియోజకవర్గంపై పూర్తిస్థాయి పట్టు
- మందకొడిగా కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు ప్రచారం



ఐ.పోలవరం మండలం కొమరగిరిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, పార్టీ నాయకుడు పితాని బాలకృష్ణ

సాక్షి అమలాపురం: చమురు సంస్థలకు, అపార మత్స్య సంపదకు ఖిల్లాగా నిలిచిన ముమ్మిడివరం నియోజకవర్గం ఎన్నికలలో ఉత్కంఠ పోరుకు చిరునామాగా నిలిచింది. విస్తారమైన సముద్రతీరం కలిగిన ఈ నియోజకవర్గం దేశంలోనే మడ అడవులకు ప్రత్యేకంగా నిలిచింది. సంక్షేమ అండదండలు, తీరంలోని మత్స్యకార గ్రామాలలో జరిగిన అభివృద్ధి పనులు అండగా అధికార వైఎస్సార్ సీపీ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఎన్నికల రేసులో దూసుకుపోతున్నారు. మరో వైపు ఉమ్మడి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) ప్రచారం మందకొడిగా సాగుతోంది. మిత్రపక్షమైన జనసేన ఇన్‌చార్జితోపాటు ఆ పార్టీలో కీలక నాయకులు ఒకరి తరువాత ఒకరిగా జారిపోవడంతో ఇక్కడ ఎన్నికల ముందే టీడీపీ అభ్యర్థి డీలా పడుతున్నారు.

అన్ని వర్గాల సంక్షేమం

జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ఈ నియోజకవర్గంలో మత్స్యకారులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు పెద్ద ఎత్తున అందాయి.

మరో విజయానికి పొన్నాడ సిద్ధం

ముమ్మిడివరం నియోజకవర్గం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాతో పాటు కాకినాడ జిల్లా (తాళ్లరేవు మండలం)లో భాగంగా ఉండి ప్రత్యేకత సంతరించుకుంది. ఈ నియోజకవర్గంలో అగ్నికుల క్షత్రియులు, శెట్టిబలిజలు, ఎస్సీ మాల, కాపులు అధికంగా ఉన్నారు. ఈ నియోజకవర్గం నుంచి అధికార వైఎస్సార్ సీపీ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్ కుమార్ మూడోసారి పోటీపడుతున్నారు. 2009, 2019 ఎన్నికలలో ఆయన విజేతగా నిలిచారు. మూడోసారి కూడా ఆయన విజయం సాధించి హ్యాట్రిక్ సాధించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకు తగినట్టుగా ఆయన ప్రచార సరళి సాగుతోంది.

పథకాలతో పాటు తీర గ్రామాల్లో సాగిన అభివృద్ధి, ప్రధానంగా తాగునీటి సమస్య పరిష్కారం పొన్నాడకు కలిసి వచ్చింది. ఈ కారణంగా ఆయన ప్రచారానికి జనం బ్రహ్మరథం పడుతున్నారు. పొన్నాడ ఎన్నికల ప్రచారంలో ముందుకు దూసుకుపోతున్నారు. ప్రతి రోజు రెండు, మూడు గ్రామాల వరకూ ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పొన్నాడకు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్నారు. ఆయన గడప గడపకూ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరిస్తున్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో నియోజకవర్గంలో 90 శాతం మంది వైఎస్సార్ సీపీ సానుభూతి పరులు విజయం సాధించడం ఆయనకు కలిసి వచ్చే అంశంగా మారింది. ఇది ప్రచారంలో బాగా ఉపయోగపడుతోంది. ఇటీవల జనసేన పార్టీ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ వైఎస్సార్ సీపీలో చేరడం పొన్నాడకు అదనపు బలంగా మారింది. మత్స్యకార గ్రామాలలో ప్రచారం మరింత ముమ్మరంగా సాగుతోంది.

టీడీపీ కేడర్‌లో నిరుత్సాహం

ఉమ్మడి పార్టీల నుంచి పోటీలో ఉన్న టీడీపీ అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు ప్రచారం అసంతృప్తుల నడుమ చప్పగా సాగుతోంది. ప్రచారంలో ప్రజలు అంతగా ఉండడం లేదు. నాయకులు, కార్యకర్తల హాజరు కూడా చాలా తక్కువగా ఉంది. వైఎస్సార్ సీపీ నుంచి పార్టీలో పలువురు కార్యకర్తలను చేర్చుకుంటున్నట్టు ఫొటోలకు ఫోజులు ఇస్తున్నా, చేరిన వారు తిరిగి సొంత గూటికి చేరుకుంటున్నారు. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను సైతం ప్రజల్లోకి తీసుకుని వెళ్లలేకపోతున్నారు. జనసేన, టీడీపీ నాయకులు ఇప్పటికే గ్రామాలలో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అయినా ఫలితం ఉండడం లేదు. జనసేనకు చెందిన బాలకృష్ణతో పాటు జనసేన నుంచి పలువురు పార్టీ వీడడం బుచ్చిబాబుకు ఎదురు దెబ్బగా మారింది. ఈ ప్రభావం ప్రచారంపై పడుతుండడంతో టీడీపీ కేడర్ నీరసించిపోతోంది.



ముమ్మిడివరంలో పేలవంగా సాగుతున్న టీడీపీ అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు ప్రచారం



సత్తా చాటిన పొన్నాడ

వైఎస్సార్ హయాంలో ఆరు నెలల పాటు మత్స్యకారులకు పరిహారం అందించారు. టీడీపీ పాలనలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. కానీ పొన్నాడ సతీష్ కుమార్ చమురు సంస్థల వద్ద పట్టుబట్టి సాధించారు. ఒకటి రెండు కాదు ఏకంగా రూ.647 కోట్ల పరిహారం మత్స్యకారులకు అందేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలో ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాలతో పాటు కాకినాడ జిల్లాలోని తాళ్లరేవు మండలాల్లోని మత్స్యకారులకు అధికంగా పరిహారం అందింది. గడచిన ఐదేళ్లలో జిల్లా వ్యాప్తంగా 23,458 మందికి రూ.647 కోట్ల పంపిణీ చేశారు. మొత్తం ఐదు విడతలుగా ఈ పరిహారం నేరుగా మత్స్యకారుల ఖాతాలలో డీబీటీ ద్వారా జమ చేశారు. ముమ్మిడివరం నియోజకవర్గంలోని మండలాలతో పాటు అయినవిల్లి, కె.గంగవరం, కపిలేశ్వరపురం, కొత్తపేట మండలాలకు చెందిన 69 గ్రామాలలోని 6,078 బోట్లకుగాను ఈ పరిహారం అందుతోంది. ఈ విషయంలో పొన్నాడ చూపిన చొరవ మత్స్యకారులలో చెరగని ముద్ర వేసింది. అలాగే టీడీపీ హయాంలో మొదలై పూర్తి కాకుండా మిగిలిపోయిన పశువుల్లంక మొండి వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయించి సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించేలా పొన్నాడ కృషి చేశారు. ఇవన్నీ పొన్నాడకు కలిసి వచ్చే అంశాలుగా మారాయి.

ఓటు ఫ్రం హోమ్‌ను వినియోగించుకోవాలి



హిమాన్షు శుక్లా, కలెక్టర్

అమలాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన అనంతరం ఇంటి నుంచే ఓటు వేసేందుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శుక్లా తెలిపారు. ఇందుకోసం ఫారం 12డీ పూర్తి చేసి సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమర్పించాలన్నారు. ఈ ఫారం సేకరించే బాధ్యతను బూత్ స్థాయి ఆఫీసర్‌కు అప్పగించినట్టు తెలిపారు. 85 ఏళ్ల పైబడిన, 40 శాతం వైకల్యం ఉన్న వారు అర్హులన్నారు. ఫారం 12డీ తో పాటు దివ్యాంగ ఓటర్లు వికలాంగ ధ్రువీకరణ పత్రం కూడా సమర్పించాలన్నారు. ఇంటి వద్దే ఓటు వేసే ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేస్తారని, ఓటు ఎవరికి వేశారో తెలియకుండా గోప్యత, రహస్య ఓటింగ్ విధానాన్ని అమలు చేస్తారన్నారు. ఈ వర్గాల వారికి పోలింగ్ సమయంలో ఇబ్బందులు కలగకుండా ఎన్నికల సంఘం ఈ చర్యలు తీసుకుందన్నారు. ఈ ఓటర్ల ఇళ్ల వద్దకు భద్రతా అధికారులతో పాటు ప్రత్యేక పోలింగ్ సిబ్బంది వెళతారన్నారు. ఎప్పుడు ఇంటికి వచ్చేదీ ముందుగానే ఆయా ఓటర్లకు సమాచారం తెలియజేస్తారన్నారు. ఇంటి వద్ద ఓటు వేసిన తరువాత ఆ బ్యాలెట్లను భద్రంగా బ్యాక్సుల్లో ఉంచి తిరిగి రిటర్నింగ్ అధికారికి స్వాధీనం చేస్తారన్నారు. ఈ బ్యాలెట్ ఓట్లను సాధారణ ఓట్ల లెక్కింపు సమయంలో కౌంటింగ్ చేస్తారని వివరించారు.

సీఎం బస్సు యాత్రను జయప్రదం చేయండి

వైఎస్సార్ సీపీ నేత మిథున్‌రెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 16న రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో నిర్వహించనున్న 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎంపీ, పార్టీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి ఎమ్మెల్యేలకు, పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. బస్సు యాత్ర నిర్వహణపై నగరంలోని హోటల్ మంజీరా సరోవర్‌లో ఎమ్మెల్యేలు, పార్టీ నేతలకు ఆయన శనివారం దిశానిర్దేశం చేశారు.

మండుటెండలో క్యాంపెయిన్!

- అడ్మిషన్లు చేస్తేనే జీతాలు
- కార్పొరేట్ స్కూళ్ల టీచర్లకు టార్గెట్లు

రాయవరం: 'సార్.. మీ అమ్మాయి / అబ్బాయిని మా స్కూల్లో చేర్పించండి. మీ పిల్లల్ని చేర్పించకుంటే మీ ద్వారా ఎవరైనా ఉంటే చెప్పండి. పది మందిని చేర్చాలని యాజమాన్యం టార్గెట్ విధించింది. లేకుంటే మా శాలరీ కట్ అవుతుంది. మాకూ టార్గెట్లు ఉన్నాయి. టార్గెట్ రీచ్ అవ్వక పోతే వచ్చే ఏడాది ఉద్యోగం నుంచి తొలగిస్తారు'. అంటూ ప్రైవేట్ స్కూల్ టీచర్లు మండుటెండలో క్యాంపెయిన్ చేస్తున్నారు. ప్రతి ఇంటికి తిరుగుతూ పిల్లల తల్లిదండ్రులను ప్రాధేయ పడుతున్నారు.

జిల్లాలో 456 ప్రైవేటు పాఠశాలలు

ప్రైవేటు / కార్పొరేట్ పాఠశాలల్లో పనిచేసే చిరుద్యోగుల బతుకులు చిత్తవుతున్నాయి. జూన్‌లో ప్రారంభమయ్యే విద్యా సంవత్సరానికి ఇప్పటి నుంచే విద్యార్థుల కోసం అడ్మిషన్ల వేట మొదలైంది. కొన్ని ప్రైవేట్ / కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు పెట్టే నిబంధనలకు ఆ పాఠశాలల్లో పనిచేయాలా, లేక బయటకు రావాలా అనే సందిగ్ధంలో ఉద్యోగులు సతమతమవుతున్నారు. జిల్లాలో దాదాపు 456 ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు ఉన్నాయి. వీటిలో సుమారు పదివేల మంది వరకూ సిబ్బంది పనిచేస్తున్నారు.



టార్గెట్ చేరుకుంటేనే జీతాలు

ప్రైవేట్ / కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు గత నెల నుంచే ఆయా పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను గ్రామాల్లోకి పంపిస్తున్నాయి. వారు ప్రతి ఇంటికీ వెళ్లి మీకు పిల్లలు ఉన్నారా, ఏం చదువుతున్నారు అని వివరాలు తెలుసుకుని, పిల్లలను తమ పాఠశాలలో చేర్పించాలని కోరుతున్నారు. తమ పాఠశాలలో వసతులు చూడాలని, ఫీజులను పరిశీలించాలని, ఫలితాలు చాలా బాగుంటాయని ఏకరువు పెడుతున్నారు. కొందరు టీచర్లు తమ దగ్గర చదువుకునే పిల్లలను, వారి తల్లిదండ్రులను కూడా వారి ఇళ్ల దగ్గర వారినో, బంధువుల పిల్లలనో తమ స్కూల్లో చేర్చేలా చూడమంటూ ఒత్తిడి చేస్తున్నారు. ఎలాగోలా వారికి ఇచ్చిన అడ్మిషన్ల టార్గెట్ పూర్తి చేస్తేనే మార్చి, ఏప్రిల్ నెలల జీతాలు ఇస్తామని కొన్ని కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలు పెట్టాయి. ఒక్కొక్కరూ 10 నుంచి 15 మంది పిల్లలను కచ్చితంగా పాఠశాలలో చేర్పించాలి.

ముక్కుపిండి ఫీజుల వసూలు

కొన్ని ప్రైవేటు పాఠశాలల సిబ్బంది చెబుతున్న ప్రత్యేకతలను విన్న తల్లిదండ్రులు ఆకర్షణకు లోనవుతున్నారు. ప్రభుత్వ, స్థానిక ప్రైవేటు పాఠశాలలకు మించి తమ స్కూళ్లలో సౌకర్యాలు ఉన్నాయంటూ సిబ్బంది చెబుతున్నారు. రోజువారి టెస్ట్‌లు, ప్రతి రోజు స్టడీ అవర్స్, కంప్యూటర్, లైబ్రరీ, ల్యాబ్, ప్రతి పండగ సెలబ్రేషన్స్, ఆటపాటలతో పాటు కరాటే, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉద్యోగులు బదిలీ అయితే అదే చోట బ్రాంచ్‌కు విద్యార్థుల బదిలీ సౌకర్యం కల్పిస్తామని వివరిస్తున్నారు. విద్యార్థులను పాఠశాలలో చేర్పించుకుని అడ్మిషన్ ఫీజు కట్టించుకునే వరకూ కేవలం పాఠశాల ఫీజు మాత్రమే చెబుతారు. అది చెల్లించిన తర్వాత బస్, యూనిఫాం, బుక్స్ ఫీజులంటూ ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. అప్పుడు ముందుగా క్యాంపెయిన్‌లో తిరిగి పిల్లలను చేర్పిన ఉపాధ్యాయులపై తల్లిదండ్రుల ఒత్తిళ్లు పెరుగుతున్నాయి.

అలా చేర్పిస్తేనే జీతాలు ఇస్తారు. లేకుంటే జీతం రాదు. ఆ తర్వాత ఆ పాఠశాలలో ఉద్యోగం ఉంటుందో లేదో కూడా గ్యారంటీ లేదు. ఇచ్చే అరకొర జీతాలు నిలిపి వేస్తారనే భయంతో ప్రైవేటు ఉపాధ్యాయులు తంటాలు పడుతున్నారు.

పారదర్శకంగా వైద్య కళాశాల భూసేకరణ

- అవినీతిపై చంద్రబాబు మాట్లాడడం హాస్యాస్పదం
- విలేకరులతో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: అమలాపురంలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పారదర్శకంగా భూసేకరణ చేశారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు స్పష్టం చేశారు. ఇంతటి పారదర్శకంగా జరిగిన భూసేకరణపై టీడీపీ అధినేత చంద్రబాబు అమలాపురం బహిరంగ సభలో విమర్శలు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. స్థానిక హైస్కూల్ సెంటర్ లోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్రం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్, ఈఎస్ఐ, ఇన్నర్ రింగ్ రోడ్డు తదితర స్కాముల్లో పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయిన చంద్రబాబు అమలాపురం సభలో అవినీతి, అక్రమాల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రభుత్వ వైద్య కళాశాలకు సేకరించిన 50 ఎకరాల కొనుగోలులో ఏవైనా అనుమానాలు ఉంటే సమాచార హక్కు చట్టం నివృత్తి చేసుకోవాలని సవాల్ విసిరారు. అంతేగానీ ఎవరో చెప్పిన గాలి కబుర్లు, గాలి ఆరోపణలు పట్టుకుని అమలాపురం బహిరంగ సభలో మాట్లాడడం మీ స్థాయికి తగదని చంద్రబాబుకు హితవు పలికారు. ఇదే సభలో బీసీలకు కూటమి పార్టీలైన టీడీపీ, బీజేపీ, జనసేన ఏదో చేసినట్లు, ఏవోవో చేయబోతున్నట్లు ఇస్తున్న హామీలు పూర్తిగా బూటకమన్నారు. రాష్ట్రంలోని బీసీలకు సామాజికంగా, రాజకీయంగా పెద్ద పీట వేసింది ముఖ్యమంత్రి జగనేనని స్పష్టం చేశారు. కొన్ని దశాబ్దాలుగా బీసీల కులగణన జరగలేదని, దానిని జగన్ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. ఈ కులగణనతో రాష్ట్రంలోని బీసీలకు సంక్షేమ, విద్య, ఉద్యోగాలు తదితర అంశాల్లో నిజమైన న్యాయం జరుగుతుందన్నారు. ఆర్ఎస్ఎస్‌తో దోస్తీ అయిన బీజేపీతో టీడీపీ, జనసేన జత కలిసి కూటమి పేరుతో మరోసారి రాష్ట్రంలోని ముస్లింలు, మైనార్టీలను మోసం చేసేందుకు సిద్ధమవుతున్నాని ఆరోపించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ లీగల్ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్, మున్సిపల్ కౌన్సిలర్ చిట్టూరి పెదబాబు, పార్టీ నాయకులు ముంగర ప్రసాద్, యనమదల కరుణాకర్ పాల్గొన్నారు.



అమలాపురంలో విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

జగన్ పాలనలో అందరి సంక్షేమం



గోపాలపురంలో వైఎస్సార్ సీపీలో చేరిన కొత్తపేట గౌడ సంఘ సభ్యులకు పార్టీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



ఇసుకపూడిలో వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు

- ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

కొత్తపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కుల, మత, పార్టీ రహితంగా అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందాయని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కొత్తపేట శివారు ఏనుగులమహల్ సిద్ధి వినాయక గౌడ సంఘం సభ్యులు చేబ్రోలు వెంకట గోపాలం, పరమట రాజు, మట్టా అంజిబాబు, పరమల విఘ్నేశ్వరరావు, గణేష్, అయినం గణేష్, జానన దేవానందం, రాజా, కోమలి వెంకన్న, కోట కృష్ణ, దాసరి శ్రీను, కొండేటి సింహాచలం, చేబ్రోలు వరలక్ష్మి, రేలంగి సత్యవతి, మట్టా వరలక్ష్మితో సహా 60 మంది టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు, రాష్ట్ర గౌడ సంఘం నాయకుడు మట్టా వీరబాబు గౌడ్ ఆధ్వర్యంలో గోపాలపురంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ జగ్గిరెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. సామాజిక న్యాయం ఒక్క వైఎస్సార్ సీపీతోనే సాధ్యమైందన్నారు. అందుకే తాము స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలో చేరామన్నారు. రాబోయే ఎన్నికల్లో జగ్గిరెడ్డి గెలుపునకు కృషి చేస్తామన్నారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ బీసీలను టీడీపీ ఓటు బ్యాంక్‌గా మాత్రమే వాడుకుని వారి సంక్షేమాన్ని గాలికొదిలేసిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాజకీయాలతో సంబంధం లేకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ఈ నియోజకవర్గంలో ఎంపీపీ, రెండు ఏఎంసీ చైర్మన్ పదవులను గౌడ, శెట్టిబలిజ సామాజిక వర్గానికి ఇచ్చామన్నారు.

ప్రజారంజక పాలనకు ఆదరణ : విప్పర్తి

అంబాజీపేట: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజారంజక పాలన కారణంగానే వైఎస్సార్ సీపీలో భారీగా చేరుతున్నారని పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. ఇసుకపూడిలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ అధ్యక్షతన పార్టీ జిల్లా వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎంఎం శెట్టి ఆధ్వర్యంలో జి.అగ్రహారం జనసేన, టీడీపీకి చెందిన 30 కుటుంబాలు శనివారం వేణుగోపాలరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. వారందరికీ వేణుగోపాలరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ ఏపీలో అమలవుతున్న పథకాలన్నింటినీ మిగిలిన రాష్ట్రాలు సైతం పరిశీలిస్తుండడం శుభపరిణామమన్నారు. ప్రజల మద్దతు వైఎస్సార్ సీపీకే అని తేటతెల్లం కావడంతో టీడీపీ పార్టీ కూటమికి భయం పట్టుకుందన్నారు. రాష్ట్ర ప్రజలందరూ జగన్‌కు అండగా ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి, వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, నియోజకవర్గ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ వెనుకబడిన, అట్టడుగు, పేద వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మరో అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, మట్టపర్తి యజ్ఞశ్రీ వెంకటేశ్వరరావు, చింతపల్లి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి పెదబాబు, రాయుడు కృష్ణమహేష్, పాముల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మినీ బస్సును ఢీకొన్న లారీ


మినీ బస్సును ఢీకొన్న లారీ

తుని రూరల్: తుని మండలం గవరయ్య కోనేరు సమీపంలో ఎర్రవరం వెళుతున్న ప్రైవేట్ మినీ బస్సును వెనుక నుంచి లోడు లారీ ఢీకొంది. శనివారం జరిగిన ఈ సంఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 14 మంది స్వల్పంగా గాయపడ్డారు. వీరంతా రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేసేందుకు తుని, మర్లపాడు, చేపూరు తదితర గ్రామాల నుంచి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. స్వల్పగాయాలతో బయటపడిన క్షతగాత్రులను వేర్వేరు ఆస్పత్రులకు తరలించి చికిత్స చేయించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై రమేష్ బాబు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మధు సునీల్ మృతదేహం

కాజులూరు: మండలంలోని ఉప్పుమిల్లిలో విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందాడు. గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యాళ్ల మధు సునీల్ (19) స్థానికంగా రొయ్యల చెరువులో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో చెరువు గట్టుపై చెత్తను కోస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ వైరుకు కొడవలి తగలి కోసుకుపోయింది. దీంతో కొడవలి ద్వారా విద్యుత్ ప్రవహించి మధు సునీల్ షాక్‌కు గురయ్యాడు. సహచర కూలీలు గమనించి యానాం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. గొల్లపాలెం ఎస్సై ఎం.తులసీరామ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ..

శంఖవరం: కత్తిపూడి – శంఖవరం రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొప్పిరెడ్డి దొరబాబు (34) మృతి చెందాడు. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దొరబాబు కత్తిపూడికి ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో అతడిని కత్తిపూడి నుంచి వస్తున్న టిప్పర్ వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన దొరబాబును 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దొరబాబు తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు టిప్పర్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఐ.కిశోర్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి..

తుని: స్థానిక జీఆర్పీ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని బయ్యవరం - నర్సింగిపల్లి మధ్యలో రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి (సుమారు 45 ఏళ్లు) మృతి చెందాడని తుని జీఆర్పీ ఇన్‌చార్జి ఎస్సై లోవరాజు తెలిపారు. శనివారం అందిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందినట్టు భావిస్తున్నామన్నారు. మృతుడి ఒంటిపై నిక్కరు, లేత నాచురంగు టీషర్ట్ ఉన్నాయని, ఎడమ చేతిపై హిందీలో పచ్చబొట్టు ఉందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

తెలుగింట వెలుగుల పండగ ఉగాది

- మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ వెంకటలక్ష్మీరెడ్డి
- పలువురికి ఉగాది నంది పురస్కారాల ప్రదానం


ఉగాది నంది పురస్కారాలు అందుకున్న ప్రముఖులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): తెలుగు వారి ఇంట వెలుగులు తెచ్చే పండగే ఉగాది అని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ గజ్జల వెంకటలక్ష్మీరెడ్డి అన్నారు. క్రోధినామ సంవత్సర ఉగాది సందర్భంగా శనివారం రాజమహేంద్రవరంలోని ధర్మంచర కమ్యూనిటీ హాలులో ఉభయ రాష్ట్రాలలోని ప్రముఖులకు ఉగాది నంది పురస్కారాలు ప్రదానం చేశారు. అమలాపురంలోని శ్రీసర్వణ కామేశ్వర పీఠం అధ్యక్షుడు మంగళంపల్లి కామేశ్వర సుబ్రహ్మణ్యం, కూచి భాస్కర రామం, వి.వరలక్ష్మి, అప్పాజీ వెంకటనారాయణగుప్తా, కవి, రచయిత డాక్టర్ ప్రసాదరావు తదితర 32 మందికి పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమానికి ముందుగా సుహాసినీ క్రియేషన్స్ దుర్దశ అనే నాటికను ప్రదర్శించింది. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అధ్యక్షతన ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజాయోనా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

సంస్కృతికి ప్రతిబింబం

గజ్జల వెంకటలక్ష్మీరెడ్డి మాట్లాడుతూ మన సంస్కృతికి ప్రతిబింబమైన ఉగాది అందరిలో ఆత్మీయతను నింపాలని ఆకాంక్షించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు, కళారత్న ఎస్పీ భారతి మాట్లాడుతూ మన సంస్కృతీ, సంప్రదాయాలకు పండగలు ప్రతీకలని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్ పర్సన్ కుడుపూడి సత్య శైలజ మాట్లాడుతూ షడ్రుచుల ఉగాది పచ్చడిలా మన జీవితాలు కూడా ఉంటాయని, కష్టాలను అధిగమించి సుఖంగా జీవించడానికి సరైన మార్గాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని అన్నారు. డాక్టర్ కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ ఫిలాంత్రోఫిక్ సొసైటీ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు రాజాయోనా మాట్లాడుతూ తమ సొసైటీ ద్వారా లలిత కళలను, కళాకారులను, సామాజిక వేత్తలను ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇండో ఆఫ్రికా ట్రేడ్ కౌన్సిల్ కమిషనర్ డాక్టర్ కేవీ రెడ్డి, ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ గుబ్బల రాంబాబు, వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మండెల శ్రీరామ్మూర్తి, మహిళా కమిషన్ సభ్యురాలు వినీత, బెహ్రెయిన్ తెలుగు సంఘ ప్రతినిధి రాయుడు వెంకటేశ్వరరావు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు ధారావత్ బాల్‌సన్ నాయక్ పాల్గొన్నారు.

వాడపల్లికి పోటెత్తిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వెంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం: వాడపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామిని ఉదయం ప్రత్యేకంగా పువ్వులతో అర్చకులు అలంకరించారు. స్వామివారు పూర్ణ అలంకరణలో దర్శనమిచ్చారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. గౌతమీ గోదావరిలో స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలోని క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయానికి భక్తుల రద్దీ నెలకొంది. సాధారణ భక్తులతో పాటు ఏడు వారాల నోము ఆచరిస్తున్న భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో కిక్కిరిసింది. డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ మాట్లాడుతూ స్వామివారికి ప్రత్యేక దర్శనం, అన్న ప్రసాద విరాళం, సేవలు, లడ్డూ విక్రయం, విరాళాలు, ఆన్‌లైన్ ద్వారా రూ. 41,43,642 ఆదాయం సమకూరిందన్నారు. ఆలయం వద్ద ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను నియంత్రించారు.


అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

జీడిమామిడికి టీదోమ ముప్పు


శ్రీకృష్ణపట్నంలో జీడిమామిడి తోటలను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ నరసింహారావు

- తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టండి
- ఏరువాక కో ఆర్డినేటర్ నరసింహారావు

రాజానగరం: జిల్లాలో మెట్ట ప్రాంత రైతులకు ఆధారమైన జీడిమామిడిని టీదోమ ఆశించిందని, తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టి తోటలను కాపాడుకోవాలని దివాన్ చెరువులోని ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు సూచించారు. మండలంలోని శ్రీకృష్ణపట్నం, దివాన్ చెరువు, వెలుగుబంద గ్రామాల్లోని జీడిమామిడి తోటలను శనివారం రైతులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జీడిమామిడి తోటలు పిందె, కాయ పక్వానికి వచ్చే దశలలో ఉన్నాయన్నారు. ఈ సమయంలో టీ దోమ, తామరపురుగు వంటి రసం పీల్చే పురుగులు ఆశించడం వల్ల చిగురు, పిందె, పూత రాలిపోయి, చిగుర్లు మాడిపోవడమే కాకుండా పంట దిగుబడికి నష్టం కలుగుతుందని తెలిపారు. టీ దోమ ఉనికి డిసెంబర్ నుంచి ఉన్నప్పటికీ రైతులు సకాలంలో గుర్తించి, సస్యరక్షణ చర్యలు తీసుకోకపోవడం వలన కొన్ని ప్రాంతాలలోని తోటలలో చిగుర్లు మాడిపోతున్నాయన్నారు. వీటి నివారణకు మూడు దఫాలుగా పురుగు మందులను పిచికారీ చేయాలని సూచించారు.

నివారణా చర్యలు

మొదటి దఫా కొత్తగా చిగురు వచ్చే సమయంలో 1.6 మి.లీ మోనోక్రోటోపాస్ మందును ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రెండో దఫా పూత వచ్చాక 2.5 మి.లీ క్లోరీఫైరీపాస్ 20 ఈసీ మందును ఒక లీటర్ నీటిలో కలిపి చల్లాలి. మూడో దఫా గింజ బఠాణీ గింజ సైజులో ఉన్నప్పుడు 2 మి.లీ ప్రొఫెనోపాస్‌ను ఒక లీటరు నీటిలో పిచికారీ చేయాలని తెలిపారు. వీటిలో పైరెండు దఫాలలో ఆయా మందులు పిచికారీ చేయకపోతే మూడో దఫాలోనైనా ప్రొఫెనోపాస్‌తో పాటు కార్బండిజమ్ ఒక గ్రాము లేదా మాకోజెబ్ 3 గ్రాములను ఒక లీటరు నీటిలో కలిపి చల్లాలని సూచించారు. తద్వారా టీ దోమతో పాటు తామర పురుగు, బ్లైట్ ఎండు తెగులును నివారించవచ్చు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): కాల్ఫ్యూజన్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక వైఎంవీఏ హాలులో రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సుమారు 230 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీలను రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి భీమారావు ప్రారంభించారు. శనివారం సాయంత్రానికి నాలుగు రౌండ్లు పూర్తయ్యేసరికి పది మంది క్రీడాకారులు ముందంజలో ఉన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వై.కల్యాణ్, జీవీ కుమార్, పి.హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రూ.59,500 స్వాధీనం

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఔరంగబాద్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా కారులో తరలిస్తున్న రూ.59,500 స్వాధీనం చేసుకున్నామని ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి సీహెచ్ పార్వతీ కల్యాణి తెలిపారు. ఏ విధమైన బిల్లు లేకుండా నగదు తరలిస్తుండడంతో సీజ్ చేసి పట్టణ సీఐ వి.జగదీశ్వర రావుకు అప్పగించామన్నారు.

సారా బట్టీలపై ఎస్ఈబీ దాడులు


ఈలకొలనులో సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్న సెబ్ అధికారులు

రంగంపేట: ఈలకొలను గ్రామంలోని సారా బట్టీలు, సారా విక్రయాలపై శనివారం సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సారాబట్టీలను ధ్వంసం చేసి, 105 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 2400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి, ముగ్గురిని అరెస్టు చేశారు. సెబ్ సీఐ ఎస్.రాంబాబు మాట్లాడుతూ ఈలకొలనుతో పాటు చుట్టుపక్కల తోటలు, పొలాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. ఈలకొలను గ్రామానికి చెందిన గుత్తుల సూరి బాబుకు చెందిన 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 90 లీటర్ల సారా, తయారీకి ఉపయోగించే సామగ్రి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అచ్యుతాపురంలో కురికూరి శ్రీను, అంచూరి రామాంజనేయులుకు చెందిన 1200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశామన్నారు. 145 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని నిందితుల్ని అరెస్టు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సెబ్ ఎస్సై జి.అనిల్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం అందజేత

పదేళ్లలో రూ.5 లక్షల విరాళం


ద్వారకాతిరుమల దేవస్థానం ఈవోకు విరాళం అందజేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు నారాయణరావు

కొవ్వూరు: ద్వారకాతిరుమలలోని వేంకటేశ్వర స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు కొవ్వూరు మండలం మద్దూరు సొసైటీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తోట నారాయణరావు రూ.50 వేల విరాళం ప్రకటించారు. గత పదేళ్లుగా ఈ ఆలయానికి ఏటా రూ.50 వేల చొప్పున మొత్తం రూ.ఐదు లక్షలు విరాళంగా అందజేశామని ఆయన తెలిపారు. శనివారం ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీఎస్ఎన్ రాజుకు శనివారం విరాళం సొమ్మును నారాయణరావు అందజేశారు. రూ.5 లక్షల విరాళం అందించిన దాతలకు ఏడాది మూడుసార్లు అంతరాలయం దర్శనం, సర్వ కైంకర్యసేవకు దాత కోరిన రోజు అవకాశం కల్పించడంతో పాటు ముందు రోజు వసతి సౌకర్యం అందిస్తామని ఈవో తెలిపారు. కార్యక్రమంలో నారాయణరావు సోదరుడు తోట పోసిబాబు, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి

రామచంద్రపురం: పట్టణంలోని ప్రధాన రహదారిలో డివైడర్‌ను ఢీకొని యువకుడు అక్కడిక్కడే మృతి చెందాడు. రామచంద్రపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వైఎస్సార్ నగర్‌కు చెందిన అయినవిల్లి ప్రసాద్ (28) శుక్రవారం రాత్రి మోటారు సైకిల్‌పై ద్రాక్షారామ నుంచి రామచంద్రపురం వస్తున్నాడు. కాకినాడ రోడ్డులో కుక్క రోడ్డుకు అడ్డంగా రావటంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎదురెదురుగా వాహనాల ఢీ

మధురపూడి: ఎదురెదురుగా వాహనాలు ప్రమాదవశాత్తూ ఢీకొన్నాయి. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవ్వరికీ గాయాలు కాలేదు. కోరుకొండ మండలం దోసకాయలపల్లి సమీపంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. రాజానగరం వైపు నుంచి వస్తున్న లారీని కోరుకొండ వైపు నుంచి వస్తున్న వ్యాను ఢీకొట్టింది. దీంతో లారీ ముందు చక్రం ఊడిపోయింది.



విస్తృతంగా వాహనాల తనిఖీ


రామచంద్రపురంలో కేంద్ర బలగాలతో కవాతు చేస్తున్న పోలీసులు

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసు, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, ఎస్ఈబీ బృందాలు జిల్లాలో విస్తృత దాడులు, తనిఖీలు చేస్తున్నాయి. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో ముమ్మరంగా జరుగుతున్నాయి. జిల్లాలో నిర్వహించిన దాడులు, తనిఖీల్లో 11 కేసులు నమోదు చేసి అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 9 మందిని అరెస్ట్ చేశారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వాహనాల్లో తరలిస్తున్న నగదును సీజ్ చేస్తున్నారు. ఆ వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం శనివారం రాత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది.

- ఐ.పోలవరం పోలీసు స్టేషన్ పరిధిలో రెండు కేసులకు సంబంధించి అక్రమ మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 4 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 32 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 7.52 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- అమలాపురం, ముమ్మిడివరం, ఆలమూరు, రాజోలు, కొత్తపేట పోలీసు స్టేషన్ల పరిధిలో 9 అక్రమ మద్యం కేసులకు సంబంధించి ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 2 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 164 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 33.39 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్, 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.
- రాజోలు ప్రాంతంలో నిఘా బృందాలు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వాహనం నుంచి రూ. 54, 670 స్వాధీనం చేసుకున్నాయి.
- జొన్నాడ, గోపాలపురం, బొబ్బర్లంక, దిండి, ఎదుర్లంక, నరసాపురపు పేటల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులో శనివారం వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు.
- ఎన్నికల్లో సమస్యాత్మక గ్రామాలైన అంబాజీపేట మండలం వక్కలంక, ముక్కామల, పుల్లేటికుర్రు, ఇరుసుమండ గ్రామాల్లో ఆ మండల పోలీసు అధికారులతో పాటు కేంద్ర బలగాలు కవాతు చేశాయి.
- రామచంద్రపురం పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని మాలపాడు, కొత్తూరు ప్రాంతాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో ఓటు హక్కును నిర్భయంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఉపయోగించుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలకు పోలీసులు సూచించారు.

నేడు జిల్లా అరసం మహాసభ

అమలాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రథమ మహాసభ అమలాపురం రూరల్ బండారులంకలో వీఎస్ఎం షాపింగ్ మాల్‌లోని ఆడిటోరియంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు సంఘం కన్వీనర్, రచయిత గండి స్వామిప్రసాద్ శనివారం తెలిపారు. సభకు తూర్పుగోదావరి జిల్లా అరసం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు అధ్యక్షత వహిస్తారని, ముఖ్య అతిథులుగా అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మాజీ ఎంపీపీ వూటుకూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సంగమం సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు డాక్టర్ చల్లా రవి కుమార్ తదితరులు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరుగుతుందని స్వామిప్రసాద్ తెలిపారు.